క్లుప్తంగా

మహానటి సావిత్రి సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సినీ రంగసేవలు వెలకట్టలేనివని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి, సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యా కళాక్షేత్రంలో గురువారం సావిత్రి 43వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో సావిత్రి కాలం స్వర్ణ యుగమని తెలిపారు. ఆమె కేవలం నాటి మాత్రమే కాదని, నిర్మాత, దర్శకురాలు అని గుర్తు చేశారు. విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్ రాజు మాట్లాడుతూ సావిత్రి నటజీవితాన్ని నేటి నటులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు ప్రభల శ్రీనివాస్, వడ్డాది కామేశ్వరి, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, చలపతి, పైడిపాటి వెంకన్న పాల్గొన్నారు.

నడిచే నట గ్రంథాలయం సావిత్రి

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి నడిచే నట గ్రంథాలయని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ ఏసీ ఆడిటోరియంలో గ్రంథాలయంలో సినీ క్రిటిక్ సంజయ్ కిశోర్ సంకలనం చేసిన సావిత్రి క్లాసిక్ ఫొటో చిత్ర మాలిక పరిచయ సభ గురువారం జరిగింది. జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ సావిత్రి నటనా జీవితం భావితరాలకు అందించాలనే రచయిత సంకల్పం చాలా గొప్పదన్నారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ సావిత్రి సినిమాలను చూసి ఎంతో నేర్చుకున్నానన్నారు. న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు సంజయ్ కిషోర్ సాహిత్య సేవలను వివరించారు. అనంతరం సంజయ్ కిషోర్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ శత వార్షికోత్సవాలు 32వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, నాయకులు చిరుతోటి శ్రీధర్, రాజ్యలక్ష్మి సీపీఐ, యువజన సమాఖ్య పతాకాలను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ జరిపిన పోరాటాలు, నగరాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. నాయకులు డి. బాలకోటేశ్వరరావు, సీతారావమ్మ అన్నారు. కార్యక్రమంలో విమల్, పి. రాజు, అనసూయమ్మ, రాహేలమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్‌లో భాగంగా జరిగిన అంతర్జాతీయ రేటింగ్ టోర్నమెంట్‌లో పాల్గొని రేటింగ్ సాధించిన విజయవాడ క్రీడాకారులను గ్లోబ్ చెస్ అకాడమీ అధ్యక్షుడు కె.రాజేంద్ర, అంతర్జాతీయ చెస్ కోచ్ షేక్ ఖాసీం అకాడమీలో గురువారం అభినందించారు. విజయవాడలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజయవాడ క్రీడాకారులు మహీధర్ క్లాసిక్‌లో 1517, రాపిడ్‌లో 1540, బ్లిజ్‌లో 1433, అర్షద్‌బాబా రాపిడ్‌లో 1515, బ్లిజ్‌లో 1492, గీత శ్రీకృష్ణచైతన్య రాపిడ్‌లో 1461, షేక్ నబీహా రాపిడ్‌లో 1458, దుల్కర్ అహ్మద్‌ఖాన్ బ్లిజ్‌లో 1473, చరణ్‌సోమేశ్వర్ బ్లిజ్‌లో 1505, అక్షర మాచర్ల స్టాండర్డ్స్‌లో 1437 రేటింగ్ సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రీడాకారులను మెమెంటోలతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

భూమ్ కాదు ధామ్!

రిజిస్ట్రేషన్ల భారం ఇంతింత కాదయా!

- జనవరి ఒకటి నుంచి భూ రిజిస్ట్రేషన్ విలువ 10శాతానికి పైగా పెంపు
- వరద ప్రభావిత ప్రాంతాల్లోనూ అమలు చేయాల్సిందే
- ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్
- క్రయ, విక్రయాలు లేక రిజిస్ట్రేషన్ల మందగమనం
- కొత్త ప్రతిపాదనలతో పేదలపై మరింత భారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సెప్టెంబర్ ఒకటో తేదీన బుడమేరు వరద విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. ప్రజలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. పూరి గుడిసెల నుంచి అపార్ట్‌మెంట్లు, విల్లాల వరకూ అన్నీ నీట మునిగిపోయాయి. ఈ పరిణామంతో ఆ ప్రాంతం ఎంతమాత్రం సురక్షితంగా కాదని ప్రజలు నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి రియల్ ఎస్టేట్ కుదేలైంది. వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంతో పోలిస్తే క్రయ విక్రయాలు లేక రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఇది జరిగి సరిగ్గా మూడు నెలలు. కానీ కూటమి ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు. ప్రజలపై భారాలు మోపడమే లక్ష్యంగా పాలన సాగిస్తోంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు పేదల ఆస్తుల రిజిస్ట్రేషన్ చార్జీలు భారాన్ని మోపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వరద ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, పేదలు నివసించే ప్రాంతాలు ఈ భేదం ఏమీ లేకుండా చార్జీల బాదుడే బాదుడు అన్నట్లు ముందుకెళుతోంది.

ఒకటో తేదీ నుంచి..

జనవరి ఒకటో తేదీ నుంచి ఆస్తులు, భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరగనుంది. ఇందుకు సంబంధించి విలువ పెంపు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో, విజయవాడ నగరంలో ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అనే వ్యత్యాసం లేకుండా ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ పెంపునకు ప్రతిపాదనలు రూపొందించింది. వీటిపై అభ్యంతరాలు కోరింది. విజయవాడ నగరంలో కమర్షియల్ ప్రాంతాలు, పేదలు నివసించే ప్రాంతాల్లో 10శాతం పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వరదలు వచ్చి దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ పెంచడంపై సామాన్య, మధ్య తరగతి ప్రజలు మండిపడుతున్నారు.

మారుమూల గ్రామాల్లో సైతం..

రాష్ట్ర సరిహద్దున ఉన్న గ్రామాల్లోనూ ఎకరాకు రూ. లక్ష చొప్పున భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పూర్తిగా మారుమూల గ్రామాలైన వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు, వి. అన్నవరం గ్రామాల్లో ఎకరానికి రూ. లక్ష చొప్పున పెంచారు. జయంతి గ్రామంలో ఎకరా ధర రూ. 8.50లక్షలుగా ఉంది. ఇక్కడ రూ. 9.50 లక్షలు చేశారు. దీంతో సామాన్య రైతులపై భారం పడుతోంది. ఇప్పటికే ఆ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసే వారు కూడా లేకుండా పోయారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కూడా భూములు కొనుగోలు చేసేందుకు రావడం లేదని మారు మూల గ్రామాల రైతులు వాపోతున్నారు. పిల్లలకు గిఫ్ట్‌గా భూములు ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేయాలంటే అదనపు భారం అవుతుందంటున్నారు.

వరద ప్రాంతాల్లోనూ 10శాతానికి పైనే..

విజయవాడ గాంధీనగర్, గవర్నర్‌పేట వంటి ప్రాంతాల్లో గజం ధర రూ. 1.05లక్షల వరకు ఉంది. ఇక్కడ పది శాతం పెంచారు. అలాగే పేదలు నివసించే పాయకాపురం, ప్రకాష్ నగర్, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో గజానికి రూ. 2వేల చొప్పున పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పాయకాపురంలో ప్రస్తుతం గజం ధర రూ. 15 వేలు ఉంది. దీనిని రూ. 17వేలకు పెంచారు. అజిత్‌సింగ్‌నగర్‌లో గజం రూ. 17వేలుగా ఉన్న ధరను రూ. 19వేలకు పెంచారు. ఈ ప్రాంతాల మొన్నటి బుడమేరు వరదల్లో కోలుకోకుండా దెబ్బతిన్నాయి. ఇక్కడ భూములు, ఆస్తులు కొనేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. ఇక కొండ ప్రాంతాల్లోనూ అంతే స్థాయిలో పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ 10శాతం పెంచితే 50 గజాల స్థలం ఉన్న ప్రతి ఒక్క పేద కుటుంబంపై రూ. లక్షకు పైగా భారం పడుతోంది. విద్యుత్ చార్జీలు భారం మోపిన ప్రభుత్వం ఆ వెంటనే రిజిస్ట్రేషన్ విలువ పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క శాతం పెంచినా భారమే..



ప్రస్తుత పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. క్రయ విక్రయాలు జరగడం లేదు. వరదల తర్వాత రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఈ తరుణంలో రిజిస్ట్రేషన్ విలువ పెంపు సరికాదు. ఒక్క శాతం పెంచినా అది అదనపు భారమే అవుతుంది. రిజిస్ట్రేషన్ విలువలు పెంపు విషయంలో పునరాలోచించాలి.

– దుర్గాప్రసాద్, ఆర్ఆర్ పేట

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్ స్టేషన్ 11 కేవీ విశాలాంధ్ర ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట సబ్ స్టేషన్ ఏరియా, విశాలాంధ్ర ప్రెస్ ఏరియా, బ్రహ్మానందరెడ్డి నగర్ అన్ని లైన్లు, దాసరి వారి వీధి, కోవెలమూడి వారి వీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, వేముల శ్యామలాదేవి రోడ్, బాలాజీ స్ట్రీట్, పాపయ్య వీధి, ఇజ్జాడవారివీధి, బంకపల్లి వారి వీధి, బారిస్టర్ వీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి. శాతవాహన కాలేజీ వెనుక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసెంట్ రోడ్డులో శోభాయాత్ర



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ బీసెంట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో గురువారం శోభాయాత్ర నిర్వహించారు. యాత్రలో శైవ క్షేత్రం పీఠాధిపతి శివస్వామి, ఫ్లోర్ లీడర్ ఎస్. బాలస్వామి పాల్గొన్నారు. యాత్ర బందరు రోడ్డులోని రాఘవయ్య పార్క్ నుంచి ఏలూరు రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ కేసరపల్లి వద్ద నిర్వహించే హైందవ శంఖారావం మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో వర్తక సంఘం ప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పేదల హృదయాల్లో సుస్థిర స్థానం రంగా సొంతం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదలకు అండగా నిలిచే తత్వమే వంగవీటి మోహనరంగాకు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించి పెట్టిందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వీఎం రంగా వర్ధంతిని పురస్కరించుకొని పాయకాపురంలోని ఆయన విగ్రహానికి డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పలువురు కార్పొరేటర్లతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు, నాయకులు అలంపూర్ విజయ్, హాఫీజుల్లా,సవరం కోటేశ్వరరావు పాల్గొన్నారు. పైపులరోడ్డులో వంగవీటి చిత్రపటానికి మల్లాది విష్ణు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగా ఆశయ సాధనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆశాజ్యోతి వరంగవీటి మోహన రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. స్థానిక మధురానగర్ కర్మల భవనం వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద గురువారం రంగా వర్ధంతి కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండలరావు, ప్రభల శ్రీనివాసరావు, ఎంఎస్ నారాయణ పాల్గొన్నారు.

బీబీఏ హాల్‌లో..



పాయకాపురంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

విజయవాడస్పోర్ట్స్: సివిల్‌కోర్టుల ప్రాంగణంలోని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) హాల్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. బీబీఏ అధ్యక్ష,కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) ఈ కార్యక్రమంలో పాల్గొని రంగా చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. న్యాయవాదులు వి గురునాథం, సురాబత్తుల దుర్గామల్లేశ్వరరావు, బెల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

వంగవీటికి స్వర, నృత్య నీరాజనం

విజయవాడ కల్చరల్: దివంగత వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఏపీ శ్రీరంగ భువన విజయం సేవా సంఘం ఆధ్వర్యంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహోన్నత వ్యక్తి రంగా..



వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



రంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజల కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకుడు వంగవీటి మోహన రంగా అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో వంగవీటి వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ముందుగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి రంగా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవానీ దీక్ష విరమణలు విజయవంతం

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: ఇంద్రకీలాద్రిపై ఐదు రోజుల పాటు జరిగిన భవానీ దీక్ష విరమణల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సమన్వయంతో పని చేసిన అన్ని శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంద్రకీలాద్రిపై సమర్థంగా విధులు నిర్వర్తించిన పోలీసు, దేవదాయ శాఖ అధికారులను కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కమిషనర్ అభినందించారు. కమిషనర్ మాట్లాడుతూ భవానీ దీక్ష యాప్, చైల్డ్ మానిటరింగ్ సిస్టం యాప్, అస్త్రం యాప్‌ల దీక్షల విరమణను మానటరింగ్ చేశామన్నారు. అన్ని శాఖల సిబ్బంది అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల ఈ కార్యక్రమం విజయవంతం అయిందన్నారు.



ట్రైనీ ఐపీఎస్ మనీషాకు అమ్మవారి శేష వస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదం అందజేస్తున్న సీపీ

అనంతరం భవాని దీక్ష విరమణ బందోబస్త్ విధులకు వచ్చిన పోలీస్ అధికారులకు అమ్మవారి శేష వస్త్రం, ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని కమిషనర్ అందజేశారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, డీసీపీలు గౌతమి సాలి, తిరుమలేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరాజు, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్, ట్రైనీ ఐపీఎస్ మనీషా, ఏడీసీపీలు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలని వినూత్న నిరసన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని.. స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు గురువారం వినూత్న రీతిలో ధర్నా నిర్వహించారు. స్థానిక 60వ డివిజన్‌కు చెందిన మహిళలు లాంతర్లు, దీపం బుడ్లు వెలిగించి వాంబేకాలనీ ఏ బ్లాక్‌లోని జీ ప్లస్ త్రీ అపార్ట్‌మెంట్‌ల వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్రాన్ని అంధకారం చేయొద్దంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ కార్యదర్శివర్గ సభ్యులు కె. దుర్గారావు, నగర కమిటీ సభ్యులు ఎస్.కె పీరుసాహెబ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మరింత రమణీయంగా సామాజిక న్యాయ మహాశిల్పం

స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నడిబొడ్డున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్ప సందర్శనకు వచ్చేవారికి మరింత మధురానుభూతి మిగిల్చేలా ఏర్పాట్లు మెరుగుపరుస్తామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఇందుకు సంబంధించి పటిష్ఠ ప్రణాళికతో ప్రతిపాదనల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం, స్మృతి వనానికి సంబంధించి కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సందర్శకులు, వాహనాల పార్కింగ్ ప్రాంత విస్తరణ, ఫౌంటేన్లు, ఆర్‌వో ప్లాంట్, చిల్డ్రన్ ప్లే ఏరియా తదితరాలతో పాటు సుస్థిర నిర్వహణ పరంగా భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య, జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి శిరోమణి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ, కేపీసీ ప్రాజెక్ట్ లిమిటెడ్ ప్రతినిధి వాసుదేవరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

బాబాకు ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్, పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు జరిగాయి. ఈ ఏడాది చివరి గురువారం పురస్కరించుకుని బాబాకు అమెరికాకు చెందిన దాతలు దోనేపూడి ధర్మనందస్, డి. ఉషా సహకారంతో అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. శ్రీసాయినక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. భక్తులు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పోరుబాటను జయప్రదం చేయండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కరెంటు చార్జీలను విపరీతంగా పెంచి ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. విద్యుత్ చార్జీల బాదుడుకి నిరసనగా ఈనెల 27న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ నందు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు, పార్టీ శ్రేణులకు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

వీఎం రంగా విగ్రహావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం సితార జంక్షన్‌లో ఏర్పాటు చేసిన దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగారావు విగ్రహాన్ని ఆయన తనయుడు రాధాకృష్ణ గురువారం రాత్రి ఆవిష్కరించారు. తన తండ్రి రంగా జీవితం తనకు ఆదర్శమని రాధ అన్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, వీఎం రంగా విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు కె. రాజు, జానపద గాయకుడు దామోదర గణపతి రావు అటల్ దేశానికి చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా మహిళా జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్‌కు లలిత కళాబంధు పురస్కారం అందజేశారు. పలువురు గాయనీ గాయకులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు.

ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలి

మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్



పటమట(విజయవాడతూర్పు): ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త ఉండాలనే లక్ష్యంతో సంజా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం మారిస్ స్టెల్లా కాలేజ్ ఇండోర్ స్టేడియంలో సంజా ఉత్సవ్ – ఎస్‌హెచ్‌జీ మేళ-2024ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ అర్బన్ లాగ్లీ హుడ్ మిషన్ 2.0లో భాగంగా, పేద మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతుందని, ఇందులో స్వయం సహాయక బృందాలు 100కు పైగా స్టాల్స్ లలో వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శన – అమ్మకం చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రదర్శన ఆయా తేదీల్లో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కిడ్స్ ప్లే, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాలను జరుగుతాయని అన్నారు.